



గూడూరు అటవీ శాఖ రేంజ్ పరిధిలోని ఊట్ల కల్లంలో ఎండబెట్టిన తునికాకు

తునికాకు సేకరణకు.. వేళాయె

- జిల్లాలో కసరత్తు ప్రారంభించిన అటవీశాఖ
- 1.45 లక్షల చదరపు హెక్టార్లలో అటవీ విస్తీర్ణం
- 12 యూనిట్లు.. 148 కల్లాలు
- 3,656 మంది కూలీలకు ఉపాధి

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది తునికాకు సేకరణకు అటవీ శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇటీవల అకాల వర్షాలు కురవడంతో ఆకు నాణ్యత బాగా వస్తుందని అధికారులు భావిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో అటవీ విస్తీర్ణం 1.45 లక్షల చదరపు హెక్టార్లలో ఉంది. ఈసారి ఆకు సేకరణ యూనిట్లు గణనీయంగా తగ్గాయి. గతంలో 20 యూనిట్లకు పైగా ఉండగా, ప్రస్తుతం 12 యూనిట్లకే పరిమితమయ్యాయి. ఆకు నాణ్యతగా రావాలంటే నెల రోజులకు ముందుగా ప్రూనింగ్ (కొమ్మ కొట్టడం) చేయాల్సి ఉంటుంది. తునికి చెట్లకు ఉన్న చిన్నచిన్న కొమ్మలు నరికి వేస్తే ఎక్కువ మోతాదులో నాణ్యమైన ఆకు వస్తుంది. కానీ, గత రెండు, మూడేళ్లుగా కొమ్మ కొట్టే ప్రక్రియను తునికాకు కాంట్రాక్టర్లు విస్మరించారు. దీంతో నాణ్యమైన ఆకు రాక ఆశించిన లక్ష్యం నెరవేరక పోవడంతో యూనిట్ల కొనుగోలుకు కాంట్రాక్టర్లు అనాసక్తి ప్రదర్శిస్తుండడంతో అటవీశాఖ తునికాకు యూనిట్ల సంఖ్యను తగ్గించింది.

జిల్లాలో రైతులకు, కూలీలకు వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో తునికాకు సేకరణే ప్రధాన ఆదాయ వనరు. తెల్లవారుజామునే అడవికి వెళ్లి తునికాకును సేకరించి మూటల్లో ఇళ్లకు తరలిస్తారు. ఇంట్లోనే నీడపట్టున కుటుంబ సభ్యులంతా 50ఆకులను ఒక కట్టగా కట్టి వాటిని కల్లాలపై విక్రయిస్తారు. ఇలా జిల్లాలో దాదాపు 3,656 మంది కూలీలు ఉపాధి పొందుతారు. అటవీశాఖ 50 ఆకుల కట్టకు రూ.3.30 చొప్పున వారి వద్ద కొనుగోలు చేసి ఎండబెట్టి వెయ్యి కట్టలను ఒక స్టాండర్డ్ బ్యాగుగా నింపి గుత్తేదారులకు అప్పగిస్తుంది. ఇప్పటికే ఆకు సేకరణ కల్లాల ద్వారా సేకరించడానికి ఏర్పాట్లు చేసినట్లు డీఎఫ్‌వో విశాల్ తెలిపారు. కూలీలు ఆకు సేకరణలో ఒక్కొక్క కుటుంబం రోజుకు రూ.1000 నుంచి రూ.1500 వరకు సంపాదిస్తారు. ఇలా వేసవిలో తునికాకు సేకరణ దాదాపు 25 రోజుల నుంచి 30 రోజుల వరకు కొనసాగి కూలీలకు ఉపాధి లభిస్తుంది. స్థానికంగా బీడీలుచుట్టే కార్మికులు సైతం ఆకు సేకరించి నిల్వ చేసుకుంటారు.

వర్షాల ద్వారా నాణ్యమైన ఆకు..

ఈ ఏడాది ఏప్రిల్, మే మొదటి మాసంలో అడపాదడపా, భారీగా కురిసిన అకాల వర్షాలతో నాణ్యమైన తునికాకు రావడానికి దోహదం చేస్తాయి. సాధారణంగా అటవీశాఖ మే మొదటి వారం నుంచి ఆకు సేకరణ కోసం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఆయా డివిజన్ కార్యాలయాల్లో గుత్తేదారుల అగ్రిమెంట్ ప్రక్రియ కొనసాగుతోంది. రెండు లేదా మూడో వారంలో ఆకు సేకరణను ప్రారంభించనున్నారు. కొన్ని యూనిట్ల పరిధిలో వేగంగా తునికాకు కొనుగోళ్లు జరుగుతుండగా, మరికొన్ని యూనిట్ల పరిధిలో కల్లాల వద్ద తునికాకు కొనుగోళ్లు అడపా దడపాగా కొనసాగుతున్నాయి. కొన్ని యూనిట్ల పరిధిలో తునికాకు కొనుగోళ్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు.

యూనిట్ల వారీగా సేకరించిన స్టాండర్డ్ బ్యాగుల వివరాలు ఇలా...

జిల్లాలో గూడూరు, గంగారం, కొత్తగూడ, బయ్యారం రేంజ్ పరిధిలో మొత్తం 12 తునికాకు యూనిట్ల ద్వారా ఆకు సేకరణ చేయడానికి ఏర్పాట్లు చేశారు. వాటి పరిధిలో ఈ ఏడాది 15,100 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరించాలనే లక్ష్యం నిర్ధారించారు.

యూనిట్ పేరు	స్టాండర్డ్ బ్యాగులు	తునికాకు కల్లాలు
కంబాలపల్లి (ఏ)	1200	27
కంబాలపల్లి (బి)	800	20
కంబాలపల్లి(సి)	800	13
మట్టేవాడ	1800	04
చింతగూడ	1500	17
మర్రిగూడ (ఏ)	900	09
మర్రిగూడ (బి)	1000	12
పందెం (ఏ)	1100	05
పందెం(బి)	900	05
కొత్తగూడ	1900	14
పూనుగండ్ల	1800	12
ఓటాయి	1400	10
మొత్తం:	15,100	148



గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని ఊట్లలో తునికాకు కట్టలు కడుతున్న కూలీలు

తునికాకు సేకరణతో కూలీలకు ఉపాధి : విశాల్ బత్తుల, డీఎఫ్‌వో మహబూబాబాద్



జిల్లా వ్యాప్తంగా 12యూనిట్ల పరిధిలో కూలీలు తునికాకు సేకరణతో ఉపాధి పొందుతున్నారు. తునికాకు సేకరణ కోసం టెండర్ ప్రక్రియ చివరి దశకు చేరుకుని గుత్తేదారులు అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. త్వరలోనే తునికాకు సేకరణ పనులు చేపట్టనున్నాం. క్షేత్రస్థాయి అటవీ అధికారులు తునికాకు కల్లాలను సందర్శించి సేకరించిన ఆకు, కూలీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. దీంతో కూలీల బ్యాంక్ అకౌంట్లలోనే ఆకు సేకరణ డబ్బులు జమ అవుతాయి. ఆకు సేకరించే సమయంలో అడవికి నిప్పు పెట్టడం, వన్యప్రాణులను వేటాడడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

- హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు



ఆత్మహత్యల నివారణ సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు

మహబూబాబాద్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు నడవాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దని తెలంగాణ హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో త్వరలో ఏర్పాటు చేయబోయే ఆత్మహత్యల నివారణ సదస్సుల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి రాజేశ్వరరావు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వ్యక్తికి అన్నిదారులు మూసుకు పోయినప్పుడే ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని అన్నారు. ఆ ప్రమాదకర క్షణంలో మేము న్నామంటూ భరోసానిస్తే వారు బయటపడుతారని చెప్పారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత 20సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటి వరకు ఎంతో మంది ప్రాణాలు కాపాడడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎంపీ బలరాంనాయక్

- మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎంపీ పోరిక బలరాంనాయక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సాయిశంకర్

మహబూబాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం మానుకోట పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాంనాయక్ కలిశారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలపై చర్చించారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరీ చేయాలని సీఎంను కోరినట్లు ఎంపీ బలరాంనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పోరిక సాయిశంకర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై హెల్ప్‌డెస్క్

మహబూబాబాద్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజల వద్ద నుంచి అధికారులు స్వీకరిస్తున్నారు. హెల్ప్‌డెస్క్‌లో ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు వారికున్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఇందులో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేయాలని ఫిర్యాదులు చేశారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు అర్హులైన వారిని ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జాబితాలో చేర్చలేదని తమకు అన్యాయం జరిగిందని పలువురు ఫిర్యాదులు చేశారు. అదే విధంగా గతంలో ఇందిరమ్మ పథకంలో తమ పేరిట ఇళ్లు మంజూరీ అయినట్లు వస్తుందని అప్పట్లో తాము ఇళ్లు నిర్మించుకోలేదని.. ఎలాంటి బిల్లులు కూడా తీసుకోలేదని ఇలా పలు రకాల ఫిర్యాదులు వస్తున్నాయి. హెల్ప్‌డెస్క్ నిరంతరాయంగా ఉంటుందని, ఇందులో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని గృహ నిర్మాణ శాఖ అధికారులు తెలిపారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి

మహబూబాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 31, హౌసింగ్ 08, పంచాయతీరాజ్ శాఖ 05, ఇతర శాఖలకు సంబంధించి 30 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి మాట్లాడుతూ.. గ్రీవెన్స్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, అధికారులు సుబ్బారావు, మధుసూదన రాజు, వెంకటేశ్వర్లు, దేశీరాం, నర్సింహస్వామి, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణ, హరిప్రసాద్, ధనమ్మ, సురేష్, భీమ్లానాయక్, రజిత, ఆర్.సత్యనారాయణమూర్తి, శంకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మరిపెడ పురపాలక సంఘ కమిషనర్ నరేష్‌రెడ్డి అన్నారు. ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, ఇతర పన్నులు చెల్లించమంటూ మునిసిపల్ కమిషనర్ పేరు మీద ఎవరైనా ఫోన్ నెంబర్ 8247649631తో గాని, ఇతర నెంబర్లతో ఫోన్ చేసి క్యూఆర్ కోడ్ పంపిస్తే అలాంటి వాటికి స్పందించవద్దని అన్నారు. మరిపెడ మునిసిపాలిటీ కార్యాలయం నుంచి వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లకు మాత్రమే చెల్లించాలని కోరారు. సైబర్ కాల్స్‌కు స్పందించొద్దని, ఇతర సమాచారం నిమిత్తం మునిసిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

'భూ భారతి'తో సమస్యల సత్వర పరిష్కారం

సదస్సులో ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



పెద్దముప్పారంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

దంతాలపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో రైతుల సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దముప్పారం, ఆగపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం-2025 అవగాహన సదస్సుల్లో రైతులు తమ భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు చేసుకుంటే నేరుగా అధికారులు సమస్యకు పరిష్కారం చూపుతారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతుల కోసం భూ భారతి చట్టాన్ని తెచ్చి అన్ని భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, రైతుబంధు, రుణమాఫీ కల్పించామన్నారు. యువతకు స్వయం ఉపాధికై రాజీవ్ యువ వికాసం ద్వారా ఆదుకోనున్నామన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, డోర్నకల్ నియోజకవర్గంలో రూ.కోటి 50 లక్షలతో ఆస్పత్రుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, బీసీ, ఎస్సీలకు తగిన రిజర్వేషన్లు కల్పించామన్నారు.నూతన ఆర్‌వోఆర్ చట్టం ద్వారా రైతులకు నూతన పాసుపుస్తకాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విప్ రాంచంద్రునాయక్ పేర్కొన్నారు. భూ సమస్యలపై గతంలో తీవ్ర ఇబ్బందులు ఉండేవన్నారు. నేడు తహసీల్దార్ సమక్షంలోనే సమస్యలు పరిష్కారం కానున్నాయన్నారు. దంతాలపల్లి మండలం భూ భారతి చట్టం అమలు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైనందున ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వివేక్‌రాం, ఎంపీవో మహ్మద్ అప్సరపాషా, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, గిర్దావర్ రాజు, నజీముద్దీన్, నాయకులు కసిరెడ్డి నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో రైతులు దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

దంతాలపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టంలో భాగంగా పైలెట్ మండలంగా ఎంపికైన దంతాలపల్లిలోని రైతులు నేరుగా భూ సమస్యలపై అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. సోమవారం ఆయన పెద్దముప్పారం, ఆగపేట గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ భూ భారతి చట్టం ప్రకారం దరఖాస్తులు చేసుకున్న వారికి న్యాయమైన సేవలు అందుతాయన్నారు. ఈ చట్టం ద్వారా రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయిలో తెలంగాణ ప్రభుత్వం అధికారం ఇచ్చిందన్నారు. గతంలో ధరణితో రైతులు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. సదస్సులో పాల్గొనే అధికారులు తప్పక రైతులకు సలహాలు, సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వివేక్‌రాం, ఎంపీవో మమ్మద్ అప్సరపాషా, గిర్దావర్ నజీముద్దీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు షురూ..



జిల్లాలో 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహణ

- ప్రతీ పాఠశాలకు రూ.50వేలు మంజూరు
- 15 రోజుల పాటు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు ఈ ఏడాది నూతనంగా శిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు సిద్ధమైంది. అందుకుగాను జిల్లాలోని 18 మండలాల పరిధిలో 120 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా, వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు 85 మంది విద్యార్థులకు తగ్గకుండా ఉన్న 50 పాఠశాలలను

మిగతా 8వ పేజీలో...

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
ఎ.రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి



వేసవి సెలవుల్లో విద్యార్థులు సబ్జెక్టుల్లో పట్టు కోల్పోకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వేసవి సెలవుల్లో శిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింది. శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు విద్యార్థులను పంపించి ప్రోత్సహించాలి. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాం. ఈ నెల 5న శిక్షణ శిబిరాలకు ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జూమ్ మీటింగ్ నిర్వహించి శిబిరాల్లో అమలు చేయాల్సిన విధి విధానాలను వివరించాం.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి



మాట్లాడుతున్న మల్యాల కో ఆర్డినేటర్ డాక్టర్ మాలతి

మహబూబాబాద్ అగ్రికల్చర్, మే 5 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి పంట మార్పిడి చేసుకోవాలని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి రైతులకు సూచించారు. మహబూబాబాద్‌లోని రైతు వేదికలో సోమవారం జరిగిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని డాక్టర్ మాలతితో పాటు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, ఉద్యానశాఖ అధికారి మరియన్నలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాలతి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. సాగునీటిని ఆదా చేయాలని, భావితరాలకు అందించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల మాట్లాడుతూ.. యూరియా వాడకాన్ని తగ్గించాలని, తద్వారా పెట్టుబడి తగ్గించుకోవడం, నేల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలన్నారు. జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి మరియన్న మాట్లాడుతూ.. వాణిజ్య పంటలతో పాటు ఆయిల్‌పామ్ తోటలను, కూరగాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ... రైతులు పప్పు, నూనెగింజల సాగు అధికంగా చేపట్టాలని అన్నారు. అనంతరం కరపత్రాలను జిల్లా అధికారులు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ రాంబాబు, మహబూబాబాద్ ఏడీఏ శ్రీనివాస్, శాంతిప్రియ, మార్కెట్ డైరెక్టర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పసుపు

రికార్డు స్థాయిలో పసుపు ధర

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాకు రూ.13,852
- రేటు ఉన్నా.. పంట సాగు లేదు..

కేసముద్రం, మే 5 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పసుపునకు ఈ సీజన్‌లో రికార్డు స్థాయి ధర నమోదైంది. సోమవారం మార్కెట్‌కు 26 మంది రైతులు 260 బస్తాల్లో కాడి రకం పసుపు, 23 మంది రైతులు 85 బస్తాల్లో గోల రకం పసుపును విక్రయించేందుకు తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలో కాడి రకం పసుపు క్వింటాకు గరిష్ఠంగా రూ.13,825, కనిష్ఠంగా రూ.9,569, సగటున రూ.11,459, గోల రకం పసుపు గరిష్ఠంగా రూ.12,051, కనిష్ఠంగా రూ.8,659, సగటున రూ.10,501 చొప్పున ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. 2022లో పసుపు క్వింటాకు రూ.8వేల వరకే ఉండగా 2023లో కాడి రకం పసుపు క్వింటాకు రూ.12వేలు, నిరుడు క్వింటాకు రూ.10వేల వరకు ఉంది. తాజాగా ఈ సీజన్‌లో రూ.13వేలు దాటడం ఓ రికార్డుగా చెప్పవచ్చు.

ధరలేక తగ్గిన సాగు విస్తీర్ణం

గత కొన్నేళ్లుగా పసుపు ధర క్రమంగా తగ్గుతూ వస్తుండడంతో రైతులు సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించుకుంటూ వచ్చారు. ఏళ్ల తరబడి పండిస్తున్న పసుపును ఓ సెంటిమెంట్ పంటగా భావిస్తూ అరకొర విస్తీర్ణంలో కొద్దిమంది రైతులు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు గత రెండేళ్లుగా నిత్యం 100 నుంచి 200 బస్తాల కంటే ఎక్కువ పసుపు విక్రయానికి రావడంలేదు. తాజాగా రెండు రోజుల సెలవుల అనంతరం మార్కెట్ ఉండడంతో 345 బస్తాల పసుపు యార్డుకు వచ్చింది. మార్కెట్‌లో ఇన్ని పసుపు రాశులు కనిపించడం ఈ ఏడాది అరుదైన విషయంగా మారింది. పసుపునకు ధరలు లేకపోవడం, పంట పండించేందుకు అధికంగా శ్రమ ఉండడంతో ఈ పంట సాగును తగ్గించి ఇతర పంటల వైపు రైతులు దృష్టి సారించారు. అనూహ్యంగా ధర పెరగడంతో వచ్చే ఏడాది మళ్లీ పసుపు సాగు చేసేందుకు పలువురు రైతులు మొగ్గుచూపుతూ విత్తన పసుపును నిల్వ పెట్టుకుంటున్నట్లు సమాచారం. ఏదేమైనా పసుపునకు ధర ఉన్నప్పటికీ రైతుల వద్ద పంట ఉత్పత్తి లేకపోవడం గమనార్హం.

వడదెబ్బతో మహిళా కూలీ మృతి



అక్కి పార్వతి (ఫైల్)

గార్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత నేపథ్యంలో ఓ మహిళా కూలీ వడదెబ్బకు గురై మృతి చెందింది. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... అంబేద్కర్ నగర్‌కు చెందిన అక్కి పార్వతి(51) రోజువారీ కూలీ నాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. గత నాలుగు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు, వడగాలులకు పార్వతి వడదెబ్బకు గురై అస్వస్థతతో ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఇంట్లోనే తుదిశ్వాస విడిచింది. కాగా, పార్వతికి భర్త అక్కి వెంకటేశ్వర్లు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలి

- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి
- ప్రపంచ సుందరి పోటీలు ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం అడవుల్లో రక్తపుటేర్లు పారించకుండా, మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తాను 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై మార్కెటింగ్ మంత్రిగా చేసిన సమయంలో మావోయిస్టు నేతలు గద్దర్, శంకర్‌లను అప్పటి సీఎం ఎన్టీఆర్ వద్దకు తీసుకెళ్లి చర్చలు జరపడం జరిగిందన్నారు. కేంద్రం కూడా శాంతిచర్చలు జరపాలన్నారు. కేంద్రానికి శత్రుదేశంతో కాకుండా సొంత ప్రజలపైన దాడులు చేయడం తగదన్నారు. ప్రపంచ సుందరి పోటీలు ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని నిర్వాహకులే హైదరాబాద్‌ను ఎంపిక చేశారని, పోటీలకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. పోటీలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనేక ఇబ్బందులున్నా రూ.22,500 కోట్లు ఖర్చు చేసి 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా రూ.35కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నట్టు కడియం పేర్కొన్నారు. ఎస్ఆర్ఈజీఎస్‌తో పథకంతో ఇప్పటికే రూ.10కోట్ల సీసీ రోడ్లు పూర్తి చేశామని, సీఆర్ఆర్ గ్రాంట్ క్రింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.14కోట్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, చిలుపూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, నాయకులు అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, దూదిపాల నరేందర్ రెడ్డి, జగదీష్‌చందర్ రెడ్డి, లింగాజీ, కొలిపాక సతీష్, గడ్డమీది సురేష్, ప్రసాద్, వెంకటేశ్వర్ రెడ్డి, జీడి రమేష్, రజాక్‌యాదవ్ పాల్గొన్నారు.

పాలనలో అసమర్థతను కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు

- కేసీఆర్ ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టును కట్టారు
- మండలిలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద చర్చావేదిక



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మహదేవపూర్, మే 5(ఆంధ్రజ్యోతి): పదహారు నెలల అసమర్థ పాలనను కప్పి పుచ్చుకొనేందుకు రేవంత్ సర్కారు అనేక ప్రయత్నాలు చేస్తోందని, పాలన చేతకాక అభివృద్ధి చేయలేక తెలంగాణను ఆగం చేస్తున్నారని శాసనమండలిలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు - వాస్తవాలు' అనే అంశాలపై సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చా వేదికలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలను పటా పంచలు చేయాలనే ఆలోచనతో ఈ చర్చా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నాడు సమైక్యాంధ్ర పాలనలో వలసవాదులు తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను తరలించుకుపోయి అన్ని రకాలుగా అభివృద్ధి చెంది మన పైనే పెత్తనం చెలాయించారన్నారు. 1956 నుంచి 2014 వరకు అనేక ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సమస్యల కాసారంగా తయారైందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ సాధనే సమస్యలకు పరిష్కారమని ఉద్యమ నేత కేసీఆర్ ఆలోచన చేశారన్నారు. సమైక్యాంధ్ర పాలనలో నీళ్లు, నియామకాలు, నిధుల దోపిడీ జరిగిందని, నీళ్ల సమస్యతోనే తెలంగాణకు మేలు జరుగుతుందని గ్రహించిన కేసీఆర్ ఆ దిశగా అడుగులు వేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ముందుగా నీటి ఉద్యమం మొదలు పెట్టారన్నారు. తెలంగాణ నీటి కోసం పడుతున్న గోస విషయంలో కాకతీయులను ఆదర్శంగా తీసుకున్న కేసీఆర్ ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, నీటిని ఒడిసిపట్టే కాకతీయుల ఆలోచనలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని వివరించారు. పదేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటి ప్రయోజనాలు పొందామని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలనే కుట్రలు చేశారన్నారు. సాగునీటి రంగంలో అపురూపమైన ప్రగతిని చూసిన కాంగ్రెస్ ఆ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డాడని ప్రజలను నమ్మించే కుట్రలు చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి ఏజెంట్ అనే విషయం అందరికీ తెలిసిందేనని తెలిపారు. ఈ ప్రాంత ప్రయోజనాలను ఆంధ్రాకు తాకట్టు పెట్టి ప్రయోజనం పొందేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలోని బ్యారేజీలు కూలిపోవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం, ఆలోచన, ఆచరణ అని నీటి పారుదల రంగ నిపుణులు వి.ప్రకాష్‌అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంపై ఎవరికి అనుమానాలు లేకున్నా ఆయనకు మాత్రం ఉందన్నారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాతనే అన్ని ప్రాంతాలకు సాగునీరు అందిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లేకపోతే ఇప్పటికి ఎప్పుడో కూలిపోయేదన్నారు. ఆంధ్రాకు నీళ్లు తరలించేందుకే కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు వి.ప్రకాష్‌రావు, మాజీ ఎమ్మెల్యే పుట్టమధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సంస్థాగతంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి
- పార్టీ కోసం పనిచేసే వారికే పట్టం: ఎంపీ కడియం కావ్య

పాలకుర్తి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి, కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం వరిస్తుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, అమర్ అలీఖాన్, ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డిలు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కార్యకర్తలు విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని కోరారు. సన్నబియ్యం పంపిణీ, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుతానన్నారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లను మూడేళ్ల కాలంలో పూర్తి చేస్తానని అన్నారు. పాలకుర్తిలో 50 పడకలు, తొర్రూరులో వంద పడకల ఆస్పత్రి, మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కొడకండ్లలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఘనత సాధించాడన్నారు. దేశంలోనే ఓబీసీ కుల గణన జరగాలని రాహుల్ గాంధీ జీవిత లక్ష్యమన్నారు. ఎమ్మెల్సీ అమర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కకు పెట్టి అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎర్రబెల్లి స్వర్ణ, భరత్‌చందర్‌రెడ్డి, అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, రవళిరెడ్డి, బైకిని లింగం యాదవ్, పొట్ల నాగేశ్వరరావు, మేడి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కావ్య

తెలుగు భాష పరిరక్షణకు ఉద్యమిద్దాం

- విశ్రాంత ఆచార్యులు ఆచార్య బన్న ఐలయ్య, కవి పొట్లపల్లి శ్రీనివాసరావు
- రేపు భాషా నిలయంలో సదస్సు

హనుమకొండ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మాతృభాష తెలుగుకు ముప్పు వాటిల్లుతుందని తెలుగు ప్రజలు నివసించే రాష్ట్రంలోనే తల్లి భాషకు ఆదరణ కొరవడడం ఏమాత్రం వాంఛనీయం కాదని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు ప్రముఖ కవి ఆచార్య బన్న ఐలయ్య, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష పరిరక్షణకు రాష్ట్ర రాజధానిలో భాషాభిమానులు, కవులతో ఒక సదస్సు జరిగిందని, దానికి కొనసాగింపుగా ఓరుగల్లులోనూ తెలుగు భాషా పరిరక్షణ కోసం ఉద్యమం ప్రారంభించాలన్న యోచన ఉందన్నారు. ఇందుకు ఈ నెల 7న హనుమకొండ లోని 110 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన శ్రీరాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో భాషా పరిరక్షణ కోసం సదస్సు ఏర్పాటు చేశామని వారు చెబుతూ ఈ సదస్సులో కవులు, రచయితలు, భాషాభిమానులు ప్రతీ ఒక్కరు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాలను పరిపాలిస్తు న్న నేతలు భాష విషయంలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటూ తెలుగు భాషను అణగదొక్కే విధంగా వ్యవహరిస్తున్నారని ఆచార్య బన్న చెప్పారు.

ఇటీవల ఇంటర్ విద్యలో ఆప్షన్‌గా సంస్కృతాన్ని మాత్రమే తీసుకోవాలని ఇంటర్ బోర్డు జీవో విడుదల చేయడం పట్ల పొట్లపల్లి శ్రీనివాసరావు అభ్యంతరం చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యలో తెలుగు భాష లేకుండా చేయాలన్నట్లుగా బోర్డు నిర్ణయం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలోనే రాష్ట్ర వ్యాప్తంగా భాషాభిమానులు, విశ్వవిద్యాలయ స్థాయిల్లో కవులు, రచయితలు కూడా పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో వరంగల్‌లోనూ ఒక సదస్సు ద్వారా ఐక్యతను ప్రదర్శించి భాషాభిమానాన్ని చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

అమ్మాయి పుట్టిందని ఆక్రోశం..

- అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు
- పురుగుల మందు తాగి బాలింత ఆత్మహత్య



నిరూష (ఫైల్)

చిట్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుట్టిందని, అదనపు కట్నం ఇవ్వాలని అత్తింటి వేధింపులతో ఓ బాలింత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయ విదారక ఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని ముచినిపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ముచినిపర్తి గ్రామానికి చెందిన కత్తికొండ శంకర్ లక్ష్మీరెండవ కుమార్తె నిరూష(26)ను వరంగల్ దేశాయిపేటకు చెందిన మునుగొండ సాంబయ్య లక్ష్మీ దంపతులకు మారుడు ప్రశాంత్‌కు ఇచ్చి గత ఏడాది వివాహం జరిపించారు. కాగా ఇరవై రోజుల క్రితం ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో అమ్మాయి పుట్టిందని అదనంగా లక్ష రూపాయలు ఇవ్వాలని నిరూష, ఆమె తల్లితండ్రులపై ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఒత్తిడి చేశారు. ఆదివారం భర్తతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి నిరూష ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ నిరూష సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై హేమ తెలిపారు.

టీజీ డీఈఈ సెట్ షెడ్యూల్ విడుదల

హనుమకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : టీజీ డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. దీని ద్వారా 2025-2027 బ్యాక్‌కు సంబంధించి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ)లో ప్రభుత్వ, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ (మైనారిటీ/నాన్ మైనారిటీ) సంస్థల్లో ప్రవేశాలకు ఈ షెడ్యూల్ విడుదలైనట్లు ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ అబ్దుల్ హై తెలిపారు. ఈ మేరకు మార్చి 21న నోటిఫికేషన్ విడుదలైందని అర్హులైన అభ్యర్థులు మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించిన ఎడిట్ ఆప్షన్‌ను ఈనెల 17,18 తేదీల్లో తీసుకోవచ్చునని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఈనెల 20వ తేదీ నుండి హాల్ టికెట్లు జారీఅవుతాయని తెలిపారు. టీజీ డీఈఈ సెట్- 2025 ఆన్‌లైన్‌లో (కంప్యూటర్‌బేస్డ్ టెస్ట్) ప్రవేశ పరీక్ష ఈనెల 25న నిర్వహించనున్నట్టు తెలిపారు. కీ పైన అభ్యంతరాలు ఈనెల 28 వరకు స్వీకరిస్తారని చెప్పారు. టీజీ డీఈఈ సెట్-2025 ఫలితాలను జూన్ 5న ప్రకటిస్తారని, అర్హులైన, ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జూన్ 7 నుండి 11వ తేదీ వరకు జరుగుతుందని, అనంతరం అర్హులైన అభ్యర్థులందరూ జూన్ 13 నుండి 16వ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చునని అన్నారు. మెరిట్ ప్రాతిపదికన సంబంధిత కళాశాలలకు జూన్ 20న సీట్ల కేటాయింపు జరుగుతుందని, సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో జూన్ 21 నుండి 24 వరకు ఫీజు చెల్లించవచ్చునని, వారికి జులై 1 నుండి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అబ్దుల్ హై కోరారు.

ఉమ్మడి జిల్లా మీడియా ఇన్‌చార్జ్‌గా కందగట్ల మోహన్



మోహన్

పోచమ్మమైదాన్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా మీడియా ఇన్‌చార్జ్‌గా గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ ఆరెపల్లికి చెందిన కందగట్ల మోహన్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా చైర్మన్ నందగిరి రజనీకాంత్ సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

పెరుగుతున్న పోటీతో ఒత్తిడిలో విద్యార్థులు

- ఇందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి
- నిట్‌లో బేర్‌ఫుట్ కౌన్సెలింగ్‌పై శిక్షణ శిబిరం ప్రారంభం



బేర్‌ఫుట్ కౌన్సెలింగ్ శిబిరం ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో రోజు రోజుకు పెరుగుతున్న పోటీ వల్ల విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారనీ, ఈ ఒత్తిడి నుంచి వారిని బయటపడేయంలో అధ్యాపకులు కీలక భూమిక పోషించాలని వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి పిలుపునిచ్చారు. సోమవారం నిట్‌లో బేర్‌ఫుట్ కౌన్సెలింగ్ ఫర్ ఫ్యాకల్టీ రెండు రోజుల శిక్షణా శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బిద్యాధర్ సుబుధీ మాట్లాడుతూ అనేక రకాల ఒత్తిడులను విద్యార్థులు అధిగమించేలా చేయడానికి అధ్యాపకులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ శిబిరం ద్వారా నిట్ అధ్యాపకులకు కనీస స్థాయి కౌన్సెలింగ్ నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చి వారు విద్యార్థులకు మద్దతుగా నిలబడేట్టు చేయనున్నామన్నారు. ఇందువల్ల విద్యార్థుల్లో సంక్షోభ పరిస్థితులను అధిగమించగల సామర్థ్యం పెరుగుతుందన్నారు. నిట్ క్యాంపస్‌లో సానుకూల మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించేం దుకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తోందని డైరెక్టర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎక్స్‌ప్రెషన్ ఇండియా (ఢిల్లీ)కి చెందిన ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ జితేంద్ర నాగపాల్, డాక్టర్ గీతా మెహ్రోత్రా, హైదరాబాద్‌కు చెందిన మాజీ డీజీపీ ఆదిత్య ఆర్య, డాక్టర్ అనంత మాధవ మోహన్, ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ వేణు వినోద్, నిట్‌లోని సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్ ఇంచార్జి ప్రొఫెసర్ జి అంబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో నిట్‌లోని వివిధ విభాగాలకు చెందిన సుమారు 200 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అధ్యాపకులకు ప్రాథమిక కౌన్సెలింగ్ సాంకేతికతలను ఈ శిబిరంలో నేర్పుతారు. విద్యార్థులలో సాధారణంగా ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, ఇతర మానసిక సమస్యలను ఎదుర్కొనడంలో ఉపయోగపడే ఉత్తమ పద్ధతులు, సాధనాలు, విధానాలపై శిక్షణ ఇస్తారు.

నిట్‌లో పాజిటివ్ మైండ్‌సెట్ కోర్సు

ఈ సందర్భంగా వరంగల్ ఎన్ఐటీ హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్‌తో ఉన్న అవగాహన ఒప్పందాన్ని పునరుద్ధరించుకుంది. ఈ ఒప్పందం ప్రకారం హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్, వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులకు సంయుక్తంగా పాజిటివ్ మైండ్‌సెట్ అనే ప్రత్యేక కోర్సును అందించనున్నాయి. ఇది విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని, సమగ్ర వ్యక్తిత్వవికాసానికి దోహదపడుతుంది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7410	5300
మక్కలు	2195	1521
కందులు	6650	3022
పెసళ్లు	7601	3022
పల్లికాయ (సూక)	6200	5200
పల్లికాయ (పచ్చిది)	4050	3575
పసుపు (కాడి)	13659	10534
పసుపు (గోల)	11359	9700
తేజ మిర్చి	12000	9500
వండర్‌హాట్	11500	10000
యూఎస్341	11000	9000
దీపిక	10000	9000
దేశీ	-	-
సింగిల్ పట్టి	-	-
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

రామప్ప శిల్పం.. అపురూపం

అబ్బురపరిచే కాకతీయ శిల్పకళా చాతుర్యం



రామప్ప దేవాలయం



వెంకటాపూర్, మే 5, (ఆంధ్రజ్యోతి): కాకతీయ శిల్పకళా చాతుర్యం వర్ణించనలవి కానిది. ఎన్నేళ్లు గడిచినా చూపరులకు కట్టిపడేసే అపురూప సౌందర్యం.. రామప్ప సొంతం. భరతనాట్య శాస్త్రమంతా మూర్తీభవించినట్టుగా, స్తంభాల మీద, పైకప్పుల మీద కనబడుతుంది. రామప్ప గుడిలోని విగ్రహాలు, స్తంభాలపై ఉన్న శిల్పాలు ముఖ్యంగా దేవాలయ మంటపంపై కోణాల్లో నాలుగు పక్కల అమర్చిన పెద్ద నల్లరాతి నాట్యకత్తెల విగ్రహాలు అతి సుందరమైనవి. ఆ విగ్రహాల సొమ్ముల అలంకరణలు, వాటి త్రిభంగీ నాట్యభంగిమలు శిల్పకారులనే సమ్మోహితుల్ని చేస్తున్నాయి. దేవాలయంలోని స్తంభాలపై చెక్కిన నాట్యభంగిమలు, మృదంగాది వాద్యములు, అనేక రకాలైన వాద్యముల రేఖలు చిత్రించి ఉన్నాయి. జాయపసేనాని రచించిన నృత్యరత్నావళిలో ఉదహరించిన నాట్యశిల్పమంతా రామప్ప గుడిలో తొణికిసలాడుతూ, కనువిందు చేస్తూ పర్యాటకుల మనసు దోచుకుంటోంది. ఓ వైపు మదనికలు.. మరోవైపు మనోహర శిల్పాలు రామప్ప ప్రత్యేకత. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఆలయాలన్నిటిలో భిన్నంగా ఇక్కడ ఆనాడే అపురూప సౌందర్యరాశులకు ప్రాణం పోశారు. ఆలయమంతా ఆధ్యాత్మికత పరిమళాలే ఉన్నా.. రంగ మండల స్తంభాలు, దూలాల మధ్యన వెలుపల రెండు వైపులా ఏటవాలుగా కొలువుదీరిన నాగిని, మదనిక శిల్పాలు ఆలయాన్ని విభిన్న కళాకృతుల సమ్మేళనంగా మార్చేశాయి. మరికొద్ది రోజుల్లో ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడుతున్న పలు దేశాల సుందరీమణులు ఈనెల 14న రామప్పకు రానున్నారు. ఈ నేపథ్యంలో మదనికల విగ్రహాల గురించి..

రూపం కోల్పోని శిల్పం

అందాల 12 మొదటి శిల్పాల్లో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్న శిల్పం ఇదే. ఈశిల్పంలో ఉన్న ప్రత్యేకత ఒక కాలి బొటనవేలు మిగతా నాలుగు వేళ్లను వెనక్కి మలిచి నాట్యం చేస్తున్నట్లుగా శిల్పి చెక్కిన తీరు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. మొహంలో చిరునవ్వుతో నాట్యం చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఒక శిల్పంలో రౌద్రం, ఒకదాంట్లో లాస్యం, మరో శిల్పంలో వేట ఇలా ప్రతి శిల్పానికి ఒక ప్రత్యేకత చూపించి పర్యాటకులను ఆకట్టుకునేలా రామప్ప మదనికలు దర్శనమిస్తున్నాయి.

రౌద్రరూపంలో నాట్య భంగిమ

నవరసాల్లో భాగమే ఈ రౌద్రనాట్య భంగిమ. ఈ భంగిమను పరిశీలించినట్లయితే ఆమె ముఖ కవళికలు కానీ, ఆమె నాట్యం చేస్తున్నప్పుడు ఒకవైపు ఒరిగినప్పుడు పొట్టపై పడుతున్న మడతలు కానీ, కళ్లలో రౌద్రం కానీ, కాలు వంచినప్పుడు మోకాలు చిప్ప కాని శిల్పి చెక్కిన తీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు ఈ భంగిమ.

కోయ స్త్రీ

ఈ మదనిక శిల్పాల్లో అప్పుడున్నటువంటి అడవి చరిత్ర కళ్లకుకట్టినట్లుగా ఈ కోయ స్త్రీ భంగిమ మనకు కనిపిస్తుంది. ఆనాడు అడవి ప్రాంతంలో ఎలా వెళ్లాలి అనే అంశాన్ని ఈ భంగిమ ద్వారా చూపెట్టారు. ఈమె చేతిలో ధనస్సు, కోయ వేషధారణ ఇంకా క్షుణ్ణంగా పరిశీలిస్తే తలపై నెమలిపింఛం కూడా కనిపిస్తుంది. ఇక్కడ ఈ శిల్పంలో చూపిన అంశం ఏంటంటే ఈమె వేటకు వెళ్లినట్లుగా, వేటకు వెళ్లినప్పుడు ఆమె అరికాలు పాదంలో ముల్లు గుచ్చితే ఆ ముల్లును నూతన సేవకుడు తీస్తున్నట్లుగా చూపెట్టాడు శిల్పి. ఇందులో ప్రత్యేకత ఏమిటని గ్రహిస్తే ముల్లు గుచ్చిన చోట వాపును కూడా చూపెట్టడం శిల్పి గొప్పతనంగా చెప్పవచ్చు. అయితే అన్ని శిల్పాల్లోకల్లా ఈశిల్పం చిన్నదిగా ఉంటుందట.



నాట్య భంగిమ

కాకతీయులకు ఇష్టమైన నాట్యం పేరిణి. అందులో భాగంగానే నాట్యభంగిమను మల్చడం జరిగింది. నాట్యంలో రెండు వేళ్లతో మెడలోని హారాన్ని సపోర్టుగా చేస్తూ నాట్యం చేస్తున్నట్టు చూపెట్టాడు శిల్పి. నాట్య భంగిమపైన మనం గమనించినట్లయితే కుడిచేతి వేలు మొలకలుగాని, గోర్లుగాని మనకు స్పష్టంగా కనిపిస్తాయి. మనం ఈనాడు అనుకుంటున్న లాంగ్ నెయిల్స్(గోర్లు పెంచుకోవడం) ఆనాడే ఈ శిల్పంలో కనిపిస్తున్నాయి.

ట్రైబల్ లేడీగా శిల్పం నైపుణ్యత

ఇక్కడ కూడా ఒక ట్రైబల్ లేడీగా చూపెట్టాడు. చేతిలో బాణం, పైన చూస్తే అడవిలో ఉన్నట్టు తీగలవలె అల్లినట్లుగా పర్యాటకులకు కనిపిస్తోంది. ఈ శిల్పంలో ఆమె వేటకు వెళ్లి అలసటతో ఓ చెట్టుకింద సేద తీరుతున్నట్టుగా శిల్పి అద్భుతంగా చెక్కాడు. శిల్పంలో గొప్పతనమేంటని పరిశీలిస్తే బొటనవేలికి రెండోవేలికి మధ్యలో ఖాళీ భాగం ఇవ్వడంతోపాటు రెండో వేలికి మట్టలు కూడా కనిపించాయి.

రాగిని

రాగిని కాళ్లకు చూసినట్లయితే ఈనాడు మనం ఫ్యాషన్ అనుకున్న హైహీల్స్ (ఎత్తు మడమల చెప్పులు) 800 సంవత్సరాల క్రితమే మనకు ఇక్కడ దర్శనమిచ్చాయి. ఇప్పటి ఎత్తు మడమల చెప్పులు ఒకవైపు ఎత్తుగా ఉంటాయి కానీ, ఆనాడు రెండువైపులా వెనుక, ముందు ఎత్తుగా ఉన్నాయి. రామప్ప దేవాలయంలో ప్రతీది కూడా నేడు మనం ఫ్యాషన్ అనుకుంటున్న హైహీల్స్ చెప్పులే కానీ పెద్దపెద్ద చెవిదుద్దులు, కొప్పులు, మినీ స్కర్ట్స్ మొదలైనవి పర్యాటకులకు దర్శనమిస్తున్నాయి. ఈ మదనిక శిల్పాల్లో సంస్కృతి, సంప్రదాయాలు మనకు దర్శనమిస్తున్నాయి.

నాగిణి (విషకన్య)..

పాము పడగలపై నాట్యం చేస్తున్నట్లుగా కాళ్లకింద ఒక పాము, పాములనే ఆభరణలుగా, వస్త్రాలుగా ధరించినట్టుగా శిల్పి అద్భుతంగా మలిచాడు. మనం కనుక నిశితంగా పరిశీలిస్తే ఆమె కాలు కింద ఒక పాము కనబడుతుంది. ఆమె ఛాతిభాగంలో ఒకపాము పడగ ఆభరణంగా, ఇంకా ఆమె కాళ్ల కింద భాగంలో తొడలపై ఒక పాము పడగా కనిపిస్తోంది. నాగిణి నాట్యకారిణి శిల్ప అందానికి ముగ్ధుడై ఒక నిజాం ప్రభుత్వ అధికారి సుమారు 100ఏళ్ల క్రితం శిల్పాన్ని తన ఇంట్లో పెట్టుకున్నాడట. పీడకలలు రావడంతో తిరిగి యథాస్థానంలో 17వశతాబ్ధంలోనే రామప్పలో పెట్టినట్టు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

పాపిట బిళ్లల భంగిమ

ఈనాడు గుజరాత్, రాజస్థాన్ వాళ్లు ఉపయోగిస్తున్న పాపిట బిళ్లల సంస్కృతి ఆనాడే అంటే సుమారు 800ఏళ్లక్రితమే ఈశిల్పంలో కనిపిస్తుంది. శిల్పంలో పాపిటబిళ్లలను పాకెట్లో పెద్ద చక్రంలా కనిపించేలా పర్యాటకులను ఆకర్షించేలా శిల్పి అందంగా చెక్కడంలో ఇది ఒక భాగమే.

సర్కస్ లేడీ, జిమ్నాస్టిక్ నాట్య భంగిమ

ఇప్పుడు ఎలా అయితే పొట్టచేత పట్టుకుని వీధుల వెంట తిరిగే దొమ్మరులు పూట గడిపేందు కోసం సర్కస్ లాంటి ఫీట్లు చేస్తూ పొట్టపోసుకుంటున్నారో ఆనాడే ఇక్కడ ఈశిల్ప భంగిమలో కనిపించేలా చెక్కాడు శిల్పి. ఆభంగిమలో ఇరువైపులా ఒక మనిషి మీద ఒకరు ఎక్కి నాట్యం చేస్తున్నట్లుగా మధ్యలో కర్రసాము చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఇప్పుడు జిమ్నాస్టిక్, కర్రసాము అని ఎలా అనుకుంటున్నామో 800ఏళ్లక్రితమే ఇక్కడ కనిపిస్తుంది.



ఇటీవల రామప్పను సందర్శించిన మిస్ ఇండియా నందిని గుప్తా

రాతి నుంచి నీడ

12 మొదటి శిల్పాల్లో ఈశిల్పంలో ఒక అద్భుతమైన ఆకర్షణ కనిపిస్తుంది. పర్యాటకులు ఈ శిల్పాన్ని చూస్తూ సూర్యరశ్మి వల్ల ఈశిల్పం హారంనీడ అనేది కనిపిస్తుంది అనుకుంటే పొరపాటే. ఎందుకంటే హారం నీడ అనేది ఆ శిల్పి చెక్కిన పనితీరుకు నిదర్శనం. ఆమె మెడలో ధరించిన హారం నీడ తన పొట్టపై పడుతున్నట్లుగా కనిపించడం ఈభంగిమ ప్రత్యేకత. సూర్యోదయం మొదలుకుని సూర్యాస్తమయం వరకు ఈ నీడ ఇలానే కనిపిస్తుంది.

కోతి చిలిపి చేష్టలు

12మదనిక శిల్పాల్లో కొద్దిగా పెద్దదిగా కనిపిస్తుంది. శిల్పి కోతి యొక్క చిలిపి చేష్టలను ఇక్కడ చూపెట్టడం జరిగింది. కోతి అక్కడ ఉన్న మదనిక శిల్పం యొక్క చీరను లాగుతున్నట్లుగా చూపెట్టాడు. ఒకచేతిలో తన మానాన్ని కాపాడు కుంటూ మరో చేతితో కోతిని కొడుతున్నట్లుగా శిల్పంలో కనిపిస్తుంది. కోతిని కొట్టేటప్పుడు కూడా తన కళ్లల్లో రౌద్రం కనిపించేలా శిల్పి చెక్కిన తీరు పర్యాటకులకు ఔరా అనిపిస్తుంది.

సాధారణ నృత్యం

పేరిణి నృత్య భంగిమల్లో ఒకటైన సాధారణ భంగిమ ఆకారంలో కనిపిస్తుంది. ఈశిల్పంలో ఎలాంటి ఆహాభావాలు లేకుండా ఒక సాధారణ లేడీలా నాట్యం చేస్తుందో అలా మనకు దర్శనమివ్వడం ఈశిల్పంలోని ప్రత్యేక ఆకర్షణ.



రామప్ప ఆలయంలోని మదనిక శిల్పాలు

నాడు కీకారణ్యం.. నేడు రమణీయ పర్వం

కాళేశ్వరం చరిత్రకు కాలమే సాక్షి

మహదేవపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : త్రేతా యుగంలో దండకారణ్యంలో రాముడు సంచరించి ముక్తీశ్వరుడిని పూజించిన రామక్షేత్రం కాళేశ్వరం. ఆనాటి నుంచి దట్టమైన అడవులతో రాకపోకలు లేని సమయంలో వణ్యప్రాణుల భయంతో ఘోర అరణ్యంగా ఉన్న కాళేశ్వరంలో తినడానికి తిండి లేని పరిస్థితుల్లో క్షేత్రవాసులు అనేక ఇబ్బందులు పడి హైదరాబాద్, ముంబై, పుణె, నాగపూర్ తదితర పట్టణ ప్రాంతాలకు జీవనోపాధి కోసం ప్రవాసం వెళ్లారు. దానికి సాక్ష్యంగా గ్రామస్థులు 'కాళేశ్వరం మహక్షేత్రం.. కట్టె పిడక సురక్షితం. అన్న వస్త్రం ద్వయం నాస్తి.. శీఘ్రమే శివ దర్శనం..' అని ఒక శ్లోకం చెప్పేవారు. దీని అర్థం ఏంటంటే.. పూర్వం కట్టుకోవడానికి దుస్తులు, తినడానికి తిండి లేని క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయట. క్షామం వచ్చినప్పుడు గౌతమ మహర్షి ఇక్కడ దేశ ప్రజలకు అన్నదానం చేశాడని గోదావరి చరిత్ర చెబుతోంది. గోహత్యా పాతకాన్ని పోగొట్టుకోవడానికి గౌతమ ముని కోసం కాళేశ్వరం వరకు వచ్చింది గోదావరి. నాడు బాధలో ఉన్న వారికి తిండి పెట్టిన ప్రాంతమే ఘోర అరణ్యంగా మారి తిండి బట్ట లభించని పరిస్థితులు ఏర్పడ్డాయి. అలా కొన్ని శతాబ్దాలు గడిచాయి. ఆ తర్వాత కాళేశ్వరానికి మహర్దశ వచ్చింది. 1965లో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహరావు ఈ ప్రాంతంలో మంథని నియోజక వర్గం నుంచి మూడు సార్లు గెలిచి కాళేశ్వర క్షేత్ర జీర్ణోద్ధరణ చేయడానికి నిశ్చయించుకున్నారు. దానికి యోజనాలు తయారు చేశారు. కానీ అనివార్య కారణాలు, వ్యక్తిగత విషయాల వల్ల ఆయన చేలేకపోయారు. అదే ప్రణాళికను జగద్గురు ఆదేశానుసారం అప్పటి రాష్ట్ర మంత్రి జువ్వాడి చొక్కారావు 1976 మార్చి నెలలో కాళేశ్వరం వచ్చి ఈ క్షేత్ర పునరుద్ధరణకు కంకణం కట్టుకున్నారు. మొదటగా రెండు బస్సులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. ముఖ్య ఆలయంలో మహన్యాస పూర్వకంగా ప్రతిరోజు ఏకాదశ రుద్రాభిషేకం జరిగే విధంగా పండితులను నియమించారు. ఆంధ్రపత్రిక ద్వారా చందాలు వసూలు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. అప్పుడు కాళేశ్వరంలో వివిధ దేవాలయాలు ఉండేవి. బిందు మాధవ స్వామి బాల రాజేశ్వరస్వామి కాశీ విశ్వేశ్వరస్వామి అన్నపూర్ణ, సదాపూర్ణ, సరస్వతి, సావిత్రి, గాయత్రి, బ్రహ్మ దేవాలయం, వేంకటేశ్వరాలయం, రామాలయం, సంగమేశ్వరాలయం, వీరభద్రాలయం, జయ విజయులు, సూర్యనారాయణమూర్తి దేవాలయాలు, అహల్య గౌతముడు, సనకసనందన, సనత్కుమారులు, నారదుడు, కాల భైరవుడు, నీలకంఠేశ్వరుడు, సురభాండేశ్వరుడు, రాతి ధ్వజస్తంభం, దానిపైన నంది, దేవాలయానికి కిలోమీటరు దూరంలో ఆది ముక్తీశ్వర, మధ్య ముక్తీశ్వర, వీరంజనేయ, చంద్రశేఖర, సోమశేఖర, నర్సింహేశ్వర దేవాలయాలు ఉండేవి. ముందు భేరిశాల అనే ప్రవేశ ద్వారం ఉండేది. ఆ భేరీశాలలో సుమారు 20 శిలా



ఆనాటి కాళేశ్వరాలయం

శాసనాలు రాసి ఉండేవి. జీర్ణోద్ధరణ సమయంలో అవి అంతరించిపోయాయి.

అభివృద్ధి మొదలైందిలా..

చొక్కారావుతో పాటు ఆంధ్రప్రత్రిక సంపాదకులు వివిధ ఆధ్యాత్మిక వేత్తలు పీవీ నరసింహారావు మొదలైన నాయకులు, నటరాజన్, జీపీ రావు, కే ఎస్ శర్మ, కమలేశ్వర్‌రావు, కలెక్టర్లు జీర్ణోద్ధారణ కోసం కాళేశ్వరం వచ్చి అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. మొదటగా విజయగణపతి దేవాలయానికి శిలా స్థాపన చేయించి విజయగణపతి దేవాలయాన్ని నిర్మించి డిసెంబరు 1976లో అభినవ విద్యా తీర్థ స్వామి, భారతి తీర్థ స్వామి, జగద్గురు శంకాచార్యులు వచ్చి కరకములతో ప్రతిష్ఠలు జరిపించారు. ఆ తర్వాత జీర్ణమైన దేవాలయాలను తొలగించి నూతన నిర్మాణాలు చేపట్టారు. 1980 నుంచి 1981లో మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించారు. వివిధ ప్రాంతల నుంచి అనేక బస్సులు వేయించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచారు. 1982లో ఫిబ్రవరి 9వ తేదీన శృంగేరి జగద్గురు విద్యాతీర్థ స్వామి భారతీ తీర్థ స్వామి చేతుల మీదుగా రాజగోపురం, విమాన గోపురంపై కలశస్థాపన ప్రతిష్ఠలు, మహా కుంభాభిషేకాలు నిర్వహించారు. అప్పటి నుంచి అభివృద్ధి ప్రవర్ధమానమై సంపూర్ణమైన రమణీయ దర్శనీయ స్థలంగా విరాజిల్లుతోంది. అభివృద్ధిలో భాగంగా ఉమ్మడి ఏపీ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు క్షేత్ర అభివృద్ధిలో పాలు పంచుకున్నారు. కాళేశ్వరంలో ఆది ముక్తేశ్వరాలయం, సంగమేశ్వరాలయం, దత్తాత్రేయాలయం తదితర ఆయన చేతుల మీదుగా జరిగాయి. ప్రతిష్ఠాపన జరిగింది. ప్రస్తుతం శ్రీపాద రావు కుమారుడు ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాలంలో దేవాలయంలో అభివృద్ధి పనులు సాధించారు. గతంలో వేములవాడ, తిరుపతి దేవస్థానం కట్టించిన గదులు మాత్రమే ఉండగా ఇంకా ఎన్నో వసతి సౌకర్యాలు కల్పించారు. హోమ మండపం, వంటశాల ప్రసాదాల వితరణ కేంద్రాలు ఏర్పాటు చేయించారు. ఇలా పరిపూర్ణమైన అభివృద్ధి పనులను చేయించడమే కాకుండా ఇప్పుడు ప్రస్తుతం రూ.25కోట్లతో ఆలయ ప్రాంతం చుట్టూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్రివేణి సంగమం వద్ద సరస్వతీ మాత విగ్రహంతో పాటు పుణ్య స్నాన ఘట్టాలు, పుష్కర ఘాట్లు, పలు అభివృద్ధిపనులు జరుగుతున్నాయి.

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, కర్ణాటక, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ నుంచి లక్షలాది భక్తులు విచ్చేసి వారి మొక్కులు తీర్చుకుంటున్నారు. దేశ విదేశాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. నాడు విలువ లేని భూములకు నేడు రూ.కోట్లు పలుకుతున్నాయి. ఆనాటి గుడిసెలు నేడు భవంతు లుగా మారాయి. గతంలో ఉపాధి కోసం వలస వెళ్లిన వారంతా తిరిగి కాళేశ్వరం చేరుకుని స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. హైదరాబాద్ లో గజానికి రూ.35వేలు పలుకుతుండగా కాళేశ్వరంలో గజం రూ.70 వేలు పలకడం విశేషం.

ఆరు సరస్వతీ పుష్కరాలు చూశా : సుశీలమ్మ



నా వయస్సు తొంభై సంవత్సరలు, మా ఊరు కాళేశ్వరం. మా దగ్గర మూడు నదులు ప్రాణహిత, గోదావరి, సరస్వతి కలుస్తాయి. సంగమ తీర్థంలో స్నానం చేస్తే పుణ్యం. అన్ని నదులకు 12ఏళ్ల కోసారి పుష్కరాలు వస్తే.. మా దగ్గర మూడు సార్లు వస్తాయి. ఇప్పటి వరకు ఆరు సార్లు సరస్వతి పుష్కరాలు చూశా. నాకు తొమ్మిదేండ్ల నాడే పెండ్లయింది. మా అత్తగారు చెన్నూరు. నా భర్త 57 ఏళ్ల క్రితమే పోయాడు. అప్పడిదాక పండుగలకు, మంచి రోజుల్లో ఉత్తర వాహిని గోదావరిలో స్నానం చేసేవాళ్లం. తర్వాత కాళేశ్వరంలో ప్రతీ రోజు గంగా స్నానం చేసి లింగ దర్శనం చేసుకోవడం అలవాటు. 2023లో అనారోగ్యం బారిన పడ్డా. ఇప్పుడు చేతగావట్లె. అయినా పండుగలకు గంగకు పోయి స్నానం చేస్త. మా చిన్నప్పుడు బస్సులు, కరెంటు లేకుండే. ఎడ్లబండ్ల మీద యాత్రికులు వచ్చేవారు. ఒక్కో నదికి ఆరేసి పుష్కరాల్లో మొత్తం పద్దెనిమిది పుష్కరాల్లో నదీ స్నానం చేశా. 2022 ప్రాణహిత పుష్కరాల్లో అర్జున్ గట్టు దగ్గర స్నానం చేశా.



మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం

- 50ఎకరాల విస్తీర్ణంలో 15ఏళ్ల క్రితం ఏర్పాటు
- జోనల్ స్థాయిలో ఏడు సార్లు ప్రశంస పత్రాలు
- ఏటా 85కు పైగా శిక్షణ శిబిరాలు
- మెళకువలు నేర్చిన రైతులకు జాతీయ స్థాయిలో అవార్డులు

కృషి విజ్ఞాన కేంద్రం.. రైతుల నేస్తం

ఎన్నో శిక్షణలు మరెన్నో అవగాహన సదస్సులు

మామునూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆధునికతను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ.. సాగుబడిలో అధిక దిగుబడిని సాధించేలా.. రైతులకు సరైన సలహాలు, సూచనలే కాదు సేవలను అందించాలనే సంకల్పంతో ఏర్పాటైన కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే).. అన్నదాతలకు నేస్తంగా నిలుస్తోంది వరంగల్ కృషి విజ్ఞాన కేంద్రం. 15 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ కేవీకే ద్వారా ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులకు వివిధ పంటలపై శిక్షణ తరగతులు, ఆధునిక వ్యవసాయ రంగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కేంద్రం ద్వారా మెళకువలు నేర్చుకున్న రైతులు జాతీయ స్థాయిలో పలు అవార్డులు అందుకోగా.. పలువురు శాస్త్రవేత్తలు ప్రశంసలు అందుకున్నారు.

50ఎకరాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు..

వరంగల్ మామునూరులో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం 50ఎకరాల స్థలాన్ని కేటాయించి అందులో 2010లో కృషి విజ్ఞాన కేంద్ర భవనం నిర్మించారు. దాంతో పాటు రైతు వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. భారత పరిశోధన మండలి (ఐసీఏర్) ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకువిశేష సేవలందిస్తోంది. ఈ కేంద్రం ద్వారా రైతులకు ఆధునిక పద్ధతులపై శిక్షణ వాతావరణం పద్ధతులు, చీడపీడలు, నివారణ, నూతన యాజమాన్య పద్ధతులను వివరించడం లాంటవి శాస్త్రవేత్తలు చేస్తున్నారు. సంప్రదాయ సాగుతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆధునిక సేద్యంతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి కొత్త పరిశోధనలను రైతులకు చేరువ చేయనున్నారు. శిక్షణ తరగతుల్లో సాంకేతిక అభివృద్ధితో రైతులు ముందుకు నడిచేందుకు అండగా నిలుస్తున్నారు. సేంద్రియ వ్యవసాయం, జీవన ఎరువులు, మేలు జాతి పశువులు, వంగడాల ఏర్పాటు, చేపపిల్లల పెంపకం, పూలసాగు, తీగజాతి కురగాయల సాగుకు శాశ్వత పందిర్ల ఏర్పాట్లు, భూమిలో నత్రజని శాతంపై పరిశోధన చేస్తున్నారు. వ్యవసాయ పని అనుభవ శిక్షణలో భాగంగా ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో వందలాది మంది రైతులను సేంద్రియ సాగుదిశగా మళ్లించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని అనేక దత్తత గ్రామాలను ఏర్పాటు చేసుకొని రైతులకు సాగు సేవలందిస్తున్నారు. పలు విభాగాల్లో ఏడుగురు శాస్త్రవేత్తలు విధులు నిర్వహిస్తున్నారు.



జాతీయ అవార్డు అందుకుంటున్న ఉత్తమ రైతు

కేవికేను సద్వినియోగం చేసుకోవాలి



కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దీని ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ సాగుపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 15వేల మంది రైతులకు పైగా శిక్షణలు ఇచ్చాం.వారి సందేహాలను నివృత్తి చేసేందుకు గ్రామాల్లో పర్యటిస్తూ పంటలను పరిశీలిస్తున్నాం. రైతులు వ్యవసాయ రంగంలో నష్టపోకుండా అధిక దిగుబడులు సాధించే దిశగా కృషి చేస్తున్నాం.

\- డా.రాజన్న, కేవికే కోఆర్డినేటర్

కృషి విజ్ఞాన కేంద్రంలో ఎంతో నేర్చుకున్న



కేవీకే శాస్త్రవేత్తలు మాకు చాలా బాగా శిక్షణలు ఇచ్చారు. కృషి విజ్ఞానం కేంద్రం ద్వారా చాలా నేర్చుకున్నాం. సేంద్రియ పంటలతో పాటు చేపలు, కోళ్ల పెంపకం చేస్తున్నా. మంచి లభాలను పొందుతున్నా.

\- యాకాంబరం, సింగారం

సుగంధ ద్రవ్యాల పంటలపై మక్కువ



సుగంధ ద్రవ్యాలపై శిక్షణలు ఇవ్వడమే కాక గ్రామాల్లో ఉచితంగా మొక్కల పంపిణీ చేశారు. దాదాపు 100 మంది రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని, ఉద్యానపంటలను సాగు చేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం వారు వాటర్ ప్లాంట్ అందజేశారు.

\- వెంకన్న, జయరాం తండా,వరంగల్



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన

పెద్దవంగర, మే 5 (ఆంధ్రజ్యోతి) : తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. స్థానిక మహిళల వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో తాగునీటి బోర్లు పనిచేయక నెల రోజులైనా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి కోసం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బోర్లను మరమ్మతు చేయించి తాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో చిలుక యాకమ్మ, వెంకటమ్మ, రమ, వెంకటమ్మ, శ్రీజ, రజిత, ఎల్లమ్మ, యాకమ్మ, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు

మహబూబాబాద్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో సోమవారం టీఆర్ఎస్‌కేవీ నుంచి ఏఐటీయూసీలో 40 మంది మునిసిపల్ కార్మికులు చేరారు. వారందరిని సంఘంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎండనక వాననక, పండుగల పూట పనిచేస్తున్న కార్మికులకు నెల నెల వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, రమణ, విజయ్, రాములు, శ్రీను, నాగేశ్వరరావు, మధుసూదన్, ప్రవీణ్, లక్ష్మణ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు మైనారిటీ గురుకులంలో ప్రవేశాలకు డ్రా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను డ్రా పద్ధతిలో ఎంపిక చేయబడుతుందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు సోమవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో నాన్ మైనారిటీస్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులను 5వ తరగతిలో ప్రవేశాల కోసం బుధవారం ఉదయం 11 గంటలకు తల్లిదండ్రుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు డ్రా తీసే సమయానికి పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. పర్యవేక్షకులుగా జిల్లా మైనారిటీ అధికారి శ్రీనివాసరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్త రమేష్‌లాల్ హట్కర్ హాజరు కానున్నట్లు తెలిపారు.

మెపా మండల అధ్యక్షుడిగా రాజు

కొత్తగూడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ (మెపా) మండల అధ్యక్షుడిగా వేలుబెల్లి గ్రామానికి చెందిన అల్లాడి రాజు, ప్రధాన కార్యదర్శిగా పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన హంస వెంకటనారాయణ, ఉపాధ్యక్షుడిగా చొప్పరి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు దుండి అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ముదిరాజ్‌ల అభివృద్ధి, ఐక్యతకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నాయకులు బొల్లబోయిన యాకాంబ్రం, కొక్కు సంపత్, గుంటుక నరేష్, చాగంటి అశోక్, అర్వపల్లి వీరన్న పాల్గొన్నారు.

విద్యాశాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు

తొర్రూరు, మే 5 (ఆంధ్రజ్యోతి):విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య తెలిపారు. సోమవారం ఎంఆర్సీలో ఆయన మాట్లాడుతూ మండలంలోని తొర్రూరు, చెర్లపాలెం, మాటేడు, అమ్మాపురం, హరిపిరాల పాఠశాలల్లో ఈనెల 6వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఉంటాయని, ఈ తరగతుల్లో ఇన్‌డోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథమెటిక్ స్కిల్స్, డ్రాయింగ్, క్రాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ డ్యాన్స్, వాలిబాల్, షటిల్ గేమ్స్‌తో పాటు ఇతర ప్రత్యేక తరగతులు ఉంటాయని తెలిపారు. 5 నుంచి 10వ తరగతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, బి.వి.రావు, ప్రవీణ్ రెడ్డి, సంజయ్, రవి పాల్గొన్నారు.

రామారావు జీవితం స్ఫూర్తి దాయకం


అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): అరుణోదయ రామారావు జీవితం ప్రజా కళాకారులకు స్ఫూర్తిదాయకమని అరుణోదయ రాష్ట్రసహాయ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం అన్నారు. గూడూరు మండలం జగన్నాయకులగూడెంలో సోమవారం రామారావు 6వ స్మారక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ రామారావు స్ఫూర్తితో ప్రజా కళాకారులు ముందుకు సాగాలన్నారు. ఎన్నో నిర్బంధాలను చవిచూసిన మహోన్నత వ్యక్తి రామారావు అని కొనియాడారు. ప్రజా సాంస్కృతిక రంగంలో పట్టు సాధించి చివరి శ్వాస వరకు దాని ఉన్నతికి పాటుపడ్డారని చెప్పారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా, మండల నాయకులు బండారి ఐలయ్య, మోకాళ్ల మురళీకృష్ణ, గజ్జి లింగన్న, కొట్టెం అచ్చన్న, పుల్లన్న, తుడుం వీరభద్రం, పెనక భరత్, తిరుపతక్క, ఊకె పద్మ, వర్రె వెంకన్న, రామగిరి భిక్షం, గట్టి సురేందర్, యాదగిరి యుగందర్, గజ్జి సోమన్న, బూర్క బుచ్చిరాములు, యాకన్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

కురవి, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే సరైన మార్గమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. కురవి మండలం అయ్యగారిపల్లిలో సోమవారం మే డే పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సీపీఐ నూతన కార్యదర్శిగా బొల్లు వెంకన్న, సహాయ కార్యదర్శిగా గజ్జి చంద్రయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య, కలగూర నాగరాజు, ఎన్.గురువయ్య, కందుల యాకయ్య, బుడిగే పిచ్చయ్య, యాకన్న, వీరయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత విద్య అందించడమే పీపీటీ లక్ష్యం



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పీపీటీ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించడమే పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్టు (పీపీటీ) లక్ష్యమని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం టీఎస్-యూటీఎఫ్ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్టు ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించి 5, 6, 7 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ ప్రగతి నగర్‌లోని ప్రగతి విద్యాలయంలో నిరుపేద పిల్లల కోసం పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్టు ఆధ్వర్యంలో 5, 6, 7 తరగతుల్లో ప్రవేశం కల్పించి ఉన్నత విద్యనభ్యసించడానికి ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో విలువలతో కూడిన విద్యనందిస్తూ జీవితంలో స్థిరపడేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా నుంచి 23 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, యాకూబ్, మంజుల, హుస్సేన్, రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, రహమాన్, రమ్య, రాజేష్, వీరయ్య, జ్యోతిబసు పాల్గొన్నారు.

ఓంకార్ శత జయంతి సభను జయప్రదం చేయాలి

ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న



గూడూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మచ్చాపూర్‌లో ఈనెల 12న జరుపతలపెట్టిన వీరతెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న పిలుపునిచ్చారు. గూడూరు మండలకేంద్రంలో సోమవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణలో ప్రజలు అనేక దశాబ్దాలుగా దొరలు, భూస్వాముల దోపిడీతో ఇబ్బందులకు గురయ్యారని, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఓంకార్ ఉద్యమించారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఓంకార్ గొప్ప నాయకుడిగా, నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేశారని చెప్పారు. అసెంబ్లీలో సైతం తన గళం విప్పి అసెంబ్లీ టైగర్‌గా పేరు గడించారని పేర్కొన్నారు.

ఈబహిరంగ సభకు ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్, ప్రజా వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న, ఆర్ఎంపీఐ జాతీయ కార్యదర్శి మంగాత్రామ్‌పాస్లా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎన్డీ రాష్ట్ర నాయకులు చలపతిరావు, ప్రజాకవి జయరాజ్‌లు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బందెల వీరస్వామి, కటకం బుచ్చిరామయ్య, జి.సత్తయ్య, చంద్రయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ర్యాలీలు

కేసముద్రం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నారం, తాళ్లపూసపల్లి గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, గుగులోత్ దస్రూనాయక్, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, మాజీ జడ్పీటీసీ కదిరె సురేందర్, పొలెపాక నాగరాజు, యాదగిరి, జల్లె యాకాంబ్రం, పృథ్వీరాజ్, మాజీ సర్పంచ్ దాసు, నరేటి కొమురయ్య పాల్గొన్నారు.

బొట్టుపెట్టి అడ్మిషన్లకు ఆహ్వానం

తొర్రూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైనవిద్య అందిస్తున్నామని, విద్యార్థులు తమ కళాశాలలో చేరాలని తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పదో తరగతి పూర్తైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానించారు. సోమవారం జూనియర్ కళాశాల సిబ్బంది తొర్రూరుతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్య, పుస్తకాలు, స్కాలర్‌షిప్, హాస్టల్ సౌకర్యం, కార్పొరేట్ స్థాయిలో ఉన్నత విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరితే అత్యధిక మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ నారాయణ, సువర్ణ, ఉప్పలయ్య, నర్సయ్య, మల్లయ్య, శివరామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

కురవి, మే 5 (ఆంధ్రజ్యోతి) : కురవి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మహబూబాబాద్ ఆర్టీసీ డిపో డిప్యూటీ సూపరింటెండెంట్ గోపు శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. కురవికి చెందిన దేవాలయ మాజీ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాస్ తన తండ్రి సోమిశెట్టి వీరభద్రం జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపు శ్రీనివాస్ మాట్లాడుతూ... మే, జూన్ మాసాల్లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు శ్రీనివాస్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో మాచర్ల ఉప్పలయ్య, ఎర్ర నాగేశ్వర్‌రావు, అవిరె మోహన్‌రావు, బాదె సైదులు, దైద భద్రయ్య, బాదె శ్రీనివాస్, కానుగంటి సత్యనారాయణ, బాదె వీరభద్రం, తోట వెంకన్న, కన్నె వెంకన్న, ఆర్టీసీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, కొంపెల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు షురూ..

(5వ పేజీ తరువాయి)

విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో 15రోజుల పాటు విద్యా నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ నిర్వహణకోసం ఒక్కో పాఠశాలకు రూ.50వేల చొప్పున జిల్లాలో ఎంపికైన 50 పాఠశాలలకు రూ.25లక్షలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు శిక్షణ..

జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులకు ఈనెల 6 నుంచి 20 వరకు ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 8.20 వరకు వ్యాయామం, మెడిటేషన్, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్, యోగా లాంటివి నేర్పించనున్నారు. మే 6 నుంచి 10 వరకు 8.20 నుంచి 9.20 వరకు గంట పాటు ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్, ఉదయం 9.20 నుంచి 10 గంటల వరకు ఇండోర్ గేమ్స్, 11వ తేదీ నుంచి 15 వరకు ఉదయం 8 నుంచి 9.20 గంటల వరకు గణితం స్కిల్స్, 9.20 నుంచి 10 గంటల వరకు పెయింటింగ్, డ్రాయింగ్, 16 నుంచి 20వ తేదీ వరకు సులువైన పద్ధతిలో ఫిజిక్స్ ఎక్స్‌పరిమెంట్స్ తయారీ, క్రియేటివిటీ, టాస్క్, హిందీ, తెలుగుపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇక 10 గంటల నుంచి 10.30 వరకు ప్రతీరోజు తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌స్టోరీలపైచర్చలు ఉంటాయి.

మూడు మండలాల బీజేపీ అధ్యక్షుల నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గంలో గల మూడు మండలాలకు బీజేపీ నూతన అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సంస్థాగత రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ, జిల్లా ఎన్నికల అధికారి నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరిపెడ రూరల్ అధ్యక్షుడిగా తాళ్లఊకల్ గ్రామానికి చెందిన కట్బోజు గంగాధర్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎల్లంపేట సోమ్లతండాకు చెందిన భూక్య సుధాకర్ నాయక్, నర్సింహులపేట మండల అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన సూరబోయిన సతీష్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన గండి రమేష్‌గౌడ్‌ను, కురవి మండల అధ్యక్షుడిగా లింగ్యాతండాకు చెందిన భూక్య కిషన్‌నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మోదుగులగూడెం గ్రామానికి చెందిన కోడి రామకృష్ణను నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, జిల్లా మాజీ కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, మానుకోట పార్లమెంట్ కోకన్వీనర్ సింగారపు సతీష్, పొదిళ్ల నర్సింహారెడ్డి, గడ్డం అశోక్, రాంబాబు, వెన్నమల్ల సందీప్, అజయ్, పల్లె సందీప్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జవాను మృతి



ప్రకాష్ (ఫైల్)

కొత్తగూడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెగడపల్లిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఎస్ఎఫ్ జవాను మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం... గంగారం మండలంలోని అందుగులగూడెం గ్రామానికి చెందిన మద్దెల వెంకటలక్ష్మి, జోగయ్య దంపతుల కుమారుడు మద్దెల ప్రకాష్(32) బీఎస్ఎఫ్ జవానుగా జమ్ముకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం కొత్తగూడ మండలంలోని గోవిందాపురంలో శుభకార్యానికి వచ్చి రాత్రి తిరిగి వెళుతుండగా పెగడపల్లి గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ప్రకాష్‌ను హన్మకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కాగా, ప్రకాష్‌కు భార్య అనిత ఉన్నారు.

ఎన్నికేదైనా కాంగ్రెస్‌దే గెలుపు : ప్రభుత్వ విప్

మరిపెడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో ఎన్నికేదైనా కాంగ్రెస్ పార్టీదే గెలుపు అని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ధీమా వ్యక్తం చేశారు. మరిపెడ మండల కేంద్రంలోని భార్గవ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సర్వసభ్య సమావేశంలో ఆయనపాల్గొని మాట్లాడారు. ఎన్నికలప్పుడు చెప్పిన విధంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, రైతు రుణమాఫీ, పేదోళ్ల ఇంటికి 200 యూనిట్ల కరెంట్ ఫ్రీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పేదలకు సన్నబియ్యం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయడానికి వడ్లు పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్, యువతకు 60వేల పైచిలుకు ఉద్యోగాలు కల్పించి సీఎం రేవంత్ రెడ్డి తన ఉదార స్వభావం చూపించారని అన్నారు. సమావేశం అనంతరం మరిపెడ విశ్రాంతి భవనంలో ఎమ్మెల్యే వివాహ, జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ పరిశీలకులు నాగేశ్వరరావు, రవళిరెడ్డి, ప్రమీల, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చంద్రరెడ్డి, యుగేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘువీరారెడ్డి, రావుల రాంరెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు

జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. గూడూరు మండలం బ్రహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాల వేసి సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. మ్యూజిక్, డ్యాన్స్, పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, స్పీడ్ మ్యాథ్స్, కంప్యూటర్ బేసిక్ స్కిల్స్‌పై ఈ సమ్మర్ కోచింగ్‌లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జీసీడీవో విజయకుమారి, ఎస్‌వో సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి సన్నిధిలో విప్ ప్రత్యేక పూజలు



కురవి వీరభద్రస్వామి దేవాలయంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్

కురవి, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్ నాయక్ తన పుట్టిన రోజు, పెళ్లి రోజును పురస్కరించుకుని కురవి వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం సతీమణి డాక్టర్ ప్రమీలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ... డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రజల ఆదరాభిమానాలు ఉన్నంతకాలం విజయం సాధిస్తూ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, గార్లపాటి వెంకట్‌రెడ్డి, కొర్ను రవీందర్‌రెడ్డి, బండి వెంకట్‌రెడ్డి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, బండి లక్ష్మారెడ్డి, ఎస్.రాజేందర్‌కుమార్, బండి శ్రీనివాస్, అవిరె మోహన్‌రావు, బి.శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

- నెహ్రూసెంటర్: ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రావుల రాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుగిగంటి కమలాకర్ మాట్లాడారు. ఈకార్యక్రమంలో ప్రమోద్‌రెడ్డి, సురేష్‌నాయక్, సందీప్, బిక్కునాయక్, కిరణ్, వెంకన్న, వీరన్న, దాసరి రాజు, బీక్కు, శేఖర్ పాల్గొన్నారు.
- డోర్నకల్: డోర్నకల్‌లోని గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాల సుమీర్‌చంద్‌జైన్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, ఖాదర్‌బాబా, శంకర్, బత్తుల శ్రీనివాస్, తారాచంద్, నందనాయక్, రాహుల్, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- దంతాలపల్లి: డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పెద్దముప్పారం, దంతాలపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద పొన్నోటి బాలాజీ ఆధ్వర్యంలో రాంచందర్‌నాయక్ సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. మండల యువజన అధ్యక్షుడు సంపెట సురేష్‌గౌడ్ తన రక్తంతో తయారు చేయించిన ఎమ్మెల్యే చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా రాంచందర్ నాయక్ సురేష్ గౌడ్‌ను అభినందించారు.

బేతోలుపై అధికారులు నిర్లక్ష్యం వీడాలి

మహబూబాబాద్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ 6వ వార్డు పరిధిలోని బేతోలు అభివృద్ధిపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని సీపీఎం వార్డు ఇన్‌చార్జ్ మహ్మద్ రజాక్ ఆరోపించారు. బేతోలులో సోమవారం నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బేతోలులో తాగునీటి పైపులైన్ పగిలి రెండు నెలలు గడుస్తున్నప్పటికి ఎన్నిసార్లు అధికారులకు మొర పెట్టుకున్నప్పటికి ఫలితం లేదన్నారు. మునిసిపాలిటీ అధికారులు స్పందించి తక్షణమే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదే విధంగా 6వ వార్డులో పూర్తి స్థాయిలో డ్రెయినేజీ, సీసీ రోడ్లను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

దేశవ్యాప్త సమ్మెపై కార్మికుల నోటీసు



కేసముద్రం మునిసిపాలిటీలో సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

కేసముద్రం, మే 5 (ఆంధ్రజ్యోతి) : కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కేసముద్రం మునిసిపాలిటీ కార్యాలయంలో కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి జల్లె జయరాజ్, మునిసిపల్ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్, బిర్రు కనకలక్ష్మి, ఎండి.అక్బర్, సుంచు కొమురయ్య, శ్రవణ్, సునీత, వీరన్న, స్వామి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఏఐసీటీయూ ఆధ్వర్యంలో..

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐసీయూటీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న కోరారు. కేసముద్రం మార్కెట్ యార్డులో రాణిరుద్రమ మినీ గూడ్స్ యూనియన్ సమావేశం సోమవారం నిర్వహించగా వెంకన్న హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బండి సంతోష్, అజ్మీర రమేష్, కడారి సాగర్, కాసు సాయి, దూదిమెట్ల రాజు, బాణాల రఘు, కొమ్ము నరేష్, అజ్మీర కిషన్, బానోత్ యాకూబ్, బాదావత్ వెంకన్న, షబ్బీర్, రాములు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో కాలం చెల్లిన మందులు



వ్యవసాయ బావిలో పడేసిన మందులు

తొర్రూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ బావిలో కాలం చెల్లిన మందులు, ఇంజక్షన్‌లు, టానిక్‌లు వేసిన సంఘటన సోమవారం తొర్రూరు పట్టణ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు, వ్యవసాయ బావి రైతు గుర్రాల మహేందర్ రెడ్డి తెలిపిన ప్రకారం... తొర్రూరు నుంచి అన్నారం వెళ్లే రోడ్డులో తమ వ్యవసాయ బావి ఉండటంతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మెడికల్ షాపులో విక్రయించే మందులు, ఇంజక్షన్‌లు, టానిక్‌లు, కాటన్ బ్యాండేజీలు రెండు పెద్ద బాక్సుల్లో తీసుకువచ్చి బావిలో వేశారు. కూరగాయల పంటలు పండించేందుకు, ఎండా కాలంలో ఎడ్లకు తాగునీరు, పక్కనే ఉన్న హచ్చుతండా వాసులు ఇతరత్రా అవసరాలకు బావి నీరు వాడుకుంటారని, కాలంచెల్లిన మందులు వేయడంతో ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీలకు సంబంధించిన వివరాలు వాటిపై ఉన్నాయని, సంబంధిత అధికారులు గుర్తించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సీతారామ కాలువలో పడిన దంపతులు

- భార్య మృతి.. భర్తకు తీవ్ర గాయాలు
- బాధితులు ఖమ్మం జిల్లా కామేపల్లి మండల వాసులు



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు

గార్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్‌పై వస్తున్న దంపతులు నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టు కాలువలో పడి భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని రైల్వేగేటు సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమిలిపురి గ్రామానికి చెందిన సపావట్ బావ్‌సింగ్, భార్య విజయ(40) దంపతులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గార్ల మండలం తిర్లాపురం గ్రామంలో సోమవారం సాయంత్రం బంధువుల ఇంట్లో ఉన్న శుభకార్యానికి హాజరయ్యేందుకు బావ్‌సింగ్ దంపతులు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని రైల్వేగేటు దాటాక నిర్మాణంలో ఉన్న సీతారామ కాలువలో పడ్డారు. 40 అడుగుల లోతులో పడటంతో విజయ అక్కడికక్కడే మృతి చెందగా.. బావ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని చూసిన స్థానికులు గార్ల పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని విజయ మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీశారు. గాయపడిన బావ్‌సింగ్‌ను 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న కుమారుడు తల్లి మృతదేహం వద్ద పడి రోదించిన తీరు అక్కడి వారిని చలింపజేసింది. అయితే సీతారామ ప్రాజెక్టు కాలువ పనులు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.